అధ్వానంగా ఉద్యానవనం

- విరిగిన ఆటవస్తువులు
- బురదమయమైన పార్కు
- పట్టించుకోని అధికారులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు పార్కు అధ్వానంగా మారింది. టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో ఏర్పాటైన పార్కు నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తున్నది. ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలతో సేద తీరేందుకు వచ్చే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. అవసరమైన సౌకర్యాలు సరిగా లేకపోవడంతో చిన్నారులు ఆటలకు దూరమవుతున్నారు. పార్కుకు వచ్చే పట్టణవాసులు సైతం అసహనానికి గురవుతున్నారు. ఈ పార్కు మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో ఉంది. పార్కును ప్రారంభించిన కొత్తలో చిన్నారులకు ఆటలు ఆడుకునేందుకు పలు రకాల ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. కానీ అది మూన్నాళ్ల ముచ్చటే అయ్యింది. గతంలో పనిచేసిన కలెక్టర్ నారాయణరెడ్డి హౌసింగ్‌బోర్డు పార్కును సందర్శించారు. పార్కులో చెడిపోయిన ఆట పరికరాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని సూచించారు. అయినప్పటికీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీనిని బట్టి మున్సిపల్ అధికారులు పనితీరు ఏవిధంగా ఉందో అర్థమవుతుందని పట్టణవాసులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పార్కులో సేదతీరేందుకు ప్రతిరోజూ చిన్నాపెద్ద తేడా లేకుండా ప్రజలు వస్తుంటారు. ఆట వస్తువులు విరిగి ఉండడాన్ని చూసి చిన్నారులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. పార్కు పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో అధ్వానంగా తయారైంది.


పార్కు లోపల బురద


పార్కులో విరిగిన ఆట పరికరాలు

పార్కులో కుక్కలు, పందులు తిరుగుతుండడంతో మున్సిపల్ అధికారుల పనితీరుపై పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులు చేయిస్తాం



హౌసింగ్‌బోర్డు పార్కులో చెడిపోయిన ఆట పరికరాలకు త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం. పార్కుకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూస్తాం. పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టిసారించడంతోపాటు అన్ని విధాలా పార్కు అభివృద్ధి చేపడుతాం.
– ప్రసాద్‌చౌహాన్, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

విద్యతోనే భవిష్యత్

- తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలి
- ఎంఐఎం పార్టీ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

బోధన్‌టౌన్(బోధన్): విద్యతోనే మంచి భవిష్యత్ ఉంటుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించాలని ఎంఐఎం పార్టీ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. బుధవారం బోధన్‌కు వచ్చిన ఓవైసీ రెంజల్ బేస్‌లోని జలాల్ బుకారి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పట్టణంలోని ఆయేషా గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉర్దూ మీడియం పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు 2005 నుంచి ఆల్ ఇన్ వన్ బుక్స్‌ను పార్టీ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్నామన్నారు. సమాజంలో ఉన్నత స్థాయిలో జీవించాలంటే ధనం సరిపోదని, విద్య ఎంతో అవసరమని అన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలను తల్లిదండ్రులు చదివించాలని అన్నారు. ఉర్దూ మీడియం విద్యార్థినులు ప్రతిఏడాది ఎంసెట్, మెయిన్స్, జేఈఈల్లో ర్యాంకులు సాధిస్తున్నారని తెలిపారు. అప్పటి ముఖ్యమంత్రి నాందెండ్ల భాస్కర్‌రావుకు మద్దతు ఇవ్వడంతో మెడికల్ కళాశాలకు పర్మిషన్ వచ్చిందని, నాటి నుంచి నేటి వరకు ప్రతి ఏడాది 5 వేల మంది వైద్య విద్యను పూర్తి చేసి దేశంలోని అనేక చోట్లకు వెళ్తున్నారన్నారు. చదువుకుంటేనే కుటుంబానికి, సమాజానికి దేశానికి అండగా నిలుస్తారని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మహ్మద్ షకీల్, పట్టణ అధ్యక్షుడు ముషీర్‌బాబా, కౌన్సిలర్లు అక్తర్, అఖిల్, వలియొద్దీన్, నాయకులు ఖదీర్, అలీమ్ చావూస్, రాషత్, షమీ, ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.


బుక్స్ పంపిణీ చేస్తున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

పరిశుభ్రత పాటించాలి

బోధన్: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని బోధన్ జిల్లా ఆస్పత్రి వైద్యాధికారులు విద్యార్థులకు సూచించారు. స్వచ్ఛ భారత్ పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని తట్టికోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం కరత్రాలను ఆవిష్కరించారు.ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివశంకర, ఇన్‌చార్జి మెడికల్ సూపరింటెండెంట్ అబ్దుల్ రహీం, వైద్యాధికారులు రాహుల్, సోఫి, హెచ్‌ఎం కిశోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇద్దరు అడిషనల్ పీపీల సర్వీసు రద్దు

బోధన్: బోధన్ ఐదో జిల్లా అదనపు న్యాయమూర్తి కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీ.శ్యాంరావు, సీనియర్ సివిల్ జడ్జి (అసిస్టెంట్ సెషన్స్ కోర్టు), అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ పల్సాటి సమ్మయ్య సర్వీసులను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అసెంబ్లీ ఎన్నికల(2023) కోడ్ ఉల్లంఘించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వీరి స్థానంలో ఇన్‌చార్జీలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నిజామాబాద్ ప్రిన్సిపల్ సెషన్ కోర్టు పీపీ పీ రవిరాజ్‌ను బోధన్ ఐదో జిల్లా అదనపు న్యాయమూర్తి కోర్టు అడిషనల్ పీపీగా, నిజామాబాద్ పోక్సో కోర్టు పీపీ ఎం.రాజారెడ్డిని బోధన్ సీనియర్ సివిల్‌జడ్జి కమ్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు అదనపు పీపీగా ఇన్‌చార్జీలుగా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. తొలగించబడిన ఇద్దరు అడిషనల్ పీపీలు అసెంబ్లీ ఎన్నికల్లో ఓ రాజకీయ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు ఫిర్యాదులు వెళ్లాయని తెలుస్తోంది.

అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలి



బాల్కొండ: మండల కేంద్రంలో చెరువు భూమిని ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని తహసీల్దార్ శ్రీధర్‌కు వీడీసీ సభ్యులు బుధవారం వినతిపత్రం అందజేశారు. వెంటనే సర్వే చేయించి చెరువు భూమికి హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసినవారిలో వీడీసీ సభ్యులు అశోక్, సాయిలు, విజయ్, జక్కం నరేశ్, తోట గంగాధర్ ఉన్నారు.

హిట్ అండ్ రన్ జీవోను ఎత్తివేయాలి

ఆర్మూర్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న హిట్ అండ్ రన్ జీవోను తక్షణమే ఎత్తివేయాలని ఆర్మూర్, పెర్కిట్ లారీ, వ్యాన్ డ్రైవర్స్, ఓనర్ అసోసియేషన్ సభ్యులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఆర్మూర్ పట్టణంలోని సిద్ధులగుట్ట వెనుకాల నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు లారీ, వ్యాన్ డ్రైవర్స్ ఓనర్స్ నల్ల జెండాలతో ర్యాలీ చేపట్టారు. సభ్యులు ఖాందేష్ సుదర్శన్, అరిగెల జనక్‌రాజ్, రాము, గిరి, వినోద్, లక్కీ, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో బుధవారం దంత వైద్యపరీక్షలు నిర్వహించారు. పట్టణానికి చెందిన ప్రణతి డెంటల్ ఆస్పత్రి వైద్యుడు హనుమంత్‌రెడ్డి దంతపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు పట్వారి గోపీకృష్ణ, కార్యదర్శి పట్వారి తులసికుమార్, కోశాధికారి లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షుడు పుష్కాకర్‌రావు, దామోదర్, శశి, శివప్రసాద్ పాల్గొన్నారు.

తప్పులు లేకుండా ఆన్‌లైన్ చేయాలి

బాల్కొండ/రుద్రూర్: ప్రజాపాలన దరఖాస్తులను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో నందన్, బోధన్ డీఎల్‌పీవో గౌసొద్దీన్ సూచించారు. ఆన్‌లైన్ ప్రక్రియను మెండరా మండల పరిషత్ కార్యాలయంలో నందన్, రుద్రూర్ మండలం అక్బర్‌నగర్ శివారులోని ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో గౌసొద్దీన్ బుధవారం పరిశీలించారు. జెడ్పీ డిప్యూటీ సీఈవో వెంట ఎంపీడీవో శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు. బోధన్ డీఎల్‌పీవో వెంట ఎంపీడీవో బాల గంగాధర్, ఎంపీవో సాయిలు ఉన్నారు.

కూలీల సంఖ్యను పెంచాలి

బోధన్‌రూరల్(బోధన్) : ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచి గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించేందుకు కృషి చేయాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీడీ సంజీవ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ సంజీవ్‌కుమార్ గ్రామాల్లో నిర్వహిస్తున్న పనులపై ఆరా తీశారు. అధికారులు పర్బన్న, మధుకర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

వేల్పూర్: సమాజంలో అనాథ బాలల విద్యాభివృద్ధికి మహిళా ఉపాధ్యాయులు కృషి చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. సావిత్రీబాయి పూలే జయంతి వేడుకల సందర్భంగా బుధవారం వేల్పూర్ హైస్కూల్‌లో పీఆర్టీయూ ఆధ్వర్యంలో 35 మంది మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. పీఆర్టీయూ మండల అధ్యక్షుడు అంకం నరేశ్, ప్రధాన కార్యదర్శి దేవానందం, నాయకులు పాల్గొన్నారు.

అర్హులకు లబ్ధి చేకూర్చాలి


ఆలూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి


కల్లెడిలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

పెర్కిట్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించడమే కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు సైతం ఎన్నికల ముందు ప్రలోభాలకు గురికాకుండా ఐదేళ్ల సుపరిపాలన అందించే వారిని ఎన్నుకోవాలన్నారు. తన ఐదేళ్ల పదవి కాలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యత తనదేనన్నారు. సమస్యలు ఎదురైనప్పుడు నిలదీయడం అలవర్చుకున్నప్పుడే మార్పు మొదలవుతుందన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేశ్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో రాజగంగారాం, సర్పంచ్ క్లెం మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ దుమ్మాజి శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ తంబూర్ శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు కొత్తూర్ గిరీష్, అంగన్‌వాడీ, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

కల్లెడిలో..

మాక్లూర్: మండలంలోని కల్లెడిలో నిర్వహించిన వికసిత్ భారత్ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్‌తోపాటు ఎంపీడీవో జె క్రాంతి కేంద్ర పథకాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ లావణ్యాప్రసాద్‌గౌడ్, వైస్ ఎంపీపీ సుక్కి సుజాత, ఉపసర్పంచ్ మనీష్‌గౌడ్, ఏపీఎం అనీల్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రజిని

రెంజల్(బోధన్): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని ఎంపీపీ లోలపు రజని అన్నారు. బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. పలు శాఖలకు సంబంధించిన సమస్యలను సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఐకేపీలో జరుగుతున్న అవకతవకలపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవడంలో ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తున్నారని రెంజల్ సర్పంచ్ ప్రశ్నించారు. ఐకేపీలో పనిచేస్తున్న సిబ్బంది అక్రమాలకు పాల్పడుతూ ఆర్థికంగా ఎదుగుతుంటే.. స్వయంసహాయక సంఘాల మహిళలు మాత్రం ఆర్థికంగా ఎదగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. టార్గెట్ కోసం అవసరం లేకున్నా బలవంతగా రుణాలను అంటగట్టడంతో డిఫాల్టర్లుగా మారుతున్నారని, పర్యవేక్షణ లేకపోవడంతోనే మహిళలు తీసుకున్న రుణాలను సక్రమంగా తిరిగి చెల్లించడంలేదన్నారు. నాలుగు నెలలుగా కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు రావడంలేదని సాటాపూర్ సర్పంచ్ ఎఖార్ పాషా తహసీల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే లబ్ధిదారులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దూపల్లిలో డబుల్ బెడ్‌రూంల సమస్యను ఎందుకు పట్టించుకోవడంలేదని సర్పంచ్ సాయారెడ్డి తహసీల్దార్ రాంచందర్‌ను ప్రశ్నించారు. కొత్త రేషన్‌కార్డులు ఎప్పటి వరకు అందిస్తారని వీరన్నగుట్ట సర్పంచ్ రాజు ప్రశ్నించారు. ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించడంలేదని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, సమావేశానికి అధికారులు రాకుండా కింది స్థాయి సిబ్బందిని పంపించి చేతులు దులుపుకుంటున్నారని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెంజల్, నీలా గ్రామాల కు సాగు నీరందించే మాటు కాలువ మరమ్మతులకు నిధులు మంజూరైనా ఎందుకు పనులు చేపట్టడంలేదని కో ఆప్షన్ సభ్యుడు అంతయ్య ఏఈని నిలదీశారు. ఎంపీటీసీలు యోగేశ్, అసద్ బేగ్, అంత య్య, రుక్మిణి, లక్ష్మి, సంయుక్త, సర్పంచులు మర్ల రమేశ్‌కుమార్, ఖలీంబేగ్, ఎఖార్‌పాషా, గణేశ్‌నాయక్, సాయారెడ్డి, పాముల సాయిలు, రాజు, విజ య, శ్రీదేవి, వాణి, లలిత, వెల్మల సునీత, జాదవ్ సునీత, జమున, మధురాబాయి, హలీమాబేగం, ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ రాంచందర్‌తోపాటు అధికారులు పాల్గొన్నారు.

‘అక్షరమా.. సలాం’ ఆవిష్కరణ



ఆర్మూర్‌టౌన్: మండల పరిషత్ అధ్యక్షుడు పస్క నర్సయ్య రచించిన అక్షరమా.. సలాం పాట సీడీని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాసీం పట్టణంలోని క్షత్రీయ కళ్యాణమండపంలో బుధవారం ఆవిష్కరించారు. అనంతరం పాటను తెరపై ప్రదర్శించారు. తెలంగాణ యూనివర్సిటీ ఆచార్యులు కనకయ్య, జెడ్పీటీసీ మెట్టు సంతోష్, వైస్ ఎంపీపీ చిన్నారెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ రాజగంగారాం, ఎంపీటీసీ ఎంపీ గంగారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ పోచన్న, తిరుపతిరెడ్డి, ఆష్ట గంగాధర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాసామగ్రి అందజేత

మాక్లూర్: మండలంలోని రాంచంద్రాపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నిజామాబాద్ జిల్లా సీనియర్ సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు భూమన్న ఆధ్వర్యంలో బుధవారం క్రీడాసామగ్రిని అందజేశారు. అలాగే గ్రామంలోని వయో వృద్ధులకు దుప్పట్లు, చేతి కర్రలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తల్లిదండ్రులను బిడ్డలు కంటికి రెప్పలా కాపాడుకోవాలని, వృద్ధులను నిర్లక్ష్యం చేసే సంతానంపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందుతున్నదని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జీవీ రమణారెడ్డి, స్వప్నకుమారి, సర్పంచ్ వెంకన్న, ఎంపీటీసీ పెద్దులు, ఫోరం సభ్యులు ఎస్ రాజారెడ్డి, కె నారాయణరెడ్డి, రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు మమత, ప్రసాద్, కిషన్, రమేశ్, రంజిత్‌రెడ్డి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం


కేంద్ర బృందం సభ్యులతో డీఎంహెచ్‌వో, సిబ్బంది

రుద్రూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర ఆరోగ్య శాఖ బృందం సభ్యులు సవిత, ఇక్బాల్ బుధవారం సందర్శించారు. ల్యాబ్, ఫార్మసీ, డెలివరీ రూముతోపాటు ఆస్పత్రిని క్షుణ్ణంగా పరిశీలించారు. మౌళిక సదుపాయలు, వైద్య ప్రమాణాలు, రోగులకు అందుతున్న వైద్య సేవలు ఎలా ఉన్నాయని తెలుసుకొని వివరాలను సేకరించారు. ఓపీ, డెలివరీ, ఇమునైజేషన్ తదితర వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేంద్ర బృందం సభ్యులతో జిల్లా వైద్యాధికారి సుదర్శనం, డిప్యూటీ డీఎంహెచ్‌వో విద్య, మండల వైద్యాధికారి ఆయేషా సిద్దిఖీ, హెచ్‌ఈవో రాజేందర్, హెల్త్ సూపర్ వైజర్లు, వైద్య సిబ్బంది, ఆశవర్కర్లు ఉన్నారు.

స్టడీ మెటీరియల్ వితరణ

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు హెచ్‌ఎం చౌడారపు రాంప్రసాద్ మ్యాథ్స్ స్టడీ మెటీరియల్‌ను బుధవారం అందజేశారు. ఎస్‌సీఈఆర్‌టీ తెలంగాణ సంస్థ విడుదల చేసిన ఎస్సెస్సీ పరీక్షల బ్లూ ప్రింట్‌కు అనుగుణంగా తెలంగాణ గణితఫోరం రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను తన సొంత డబ్బులు రూ.4 వేలతో హెచ్‌ఎం కొనుగోలు చేసి 20 మంది విద్యార్థులకు అందజేశారు. ఉపాధ్యాయులు నర్సింగ్‌రావు, జ్ఞానేశ్వర్, కవిత, మమత, గీత తదితరులు పాల్గొన్నారు.

సన్మానాలు..



రెంజల్(బోధన్): మండలంలోని సర్పంచులను ఎంపీపీ లోలపు రజిని, ఎంపీడీవో శంకర్ బుధవారం సన్మానించారు. పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో సర్పంచులకు బుధవారం నిర్వహించిన సమావేశం చివరిది కానుంది. ఈ నేపథ్యంలో వారిని సన్మానించారు. జెడ్పీటీసీ మేక విజయ, వైస్ ఎంపీపీ యోగేశ్, తహసీల్దార్ రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

నాళేశ్వర్‌లో..

నవీపేట(బోధన్): మండలంలోని నాళేశ్వర్ జెడ్పీహెచ్‌ఎస్ నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన జీహెచ్‌ఎం సునీత, ఉపాధ్యాయులు నవీన్ విద్యాసాగర్‌ను బుధవారం సన్మానించారు. సర్పంచ్ సరీన్, ఎంపీటీసీ శ్యామల, ఉపసర్పంచ్ లక్ష్మణ్, వీడీసీ సభ్యులు హెచ్‌ఎం శ్రీదీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎడపల్లిలో..

ఎడపల్లి(బోధన్): ఎడపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్యే సతీమణి అయేషా ఫాతిమా, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ రజితయాదవ్, ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, ప్రిన్సిపల్ సాయిలు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం



నవీపేట : మండలంలోని జన్నేపల్లి ఎస్ఎస్ఆర్ సీనియర్ సెకండరీ పాఠశాలలో బుధవారం పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా అడిషనల్ డీసీపీ జయరామ్, డీఈవో దుర్గాప్రసాద్, ఎస్ఎస్ఆర్ విద్యా సంస్థల చైర్మన్ మారయ్యగౌడ్, సీఈవో హరితగౌడ్, ప్రిన్సిపల్ భాస్కర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గృహలక్ష్మి రద్దుపై పునరాలోచన చేయాలి


మెండోరా తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న లబ్ధిదారులు


వేల్పూర్ తహసీల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు

బాల్కొండ/కమ్మర్‌పల్లి/వేల్పూర్: గృహ లక్ష్మి పథకం రద్దు నిర్ణయంపై ప్రభుత్వం పునరాలోచించాలని లబ్ధిదారులు కోరారు. ఈ మేరకు బాల్కొండ, ముప్కాల్, మెండోరా, కమ్మర్‌పల్లి, వేల్పూర్ తహసీల్ కార్యాలయాల్లో బుధవారం వినతిపత్రాలు అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తమకు ప్రొసిడింగ్ కాపీలను అందజేయగా, ప్రస్తుత ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ప్రారంభించిన ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో తమకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని తహసీల్దార్లకు విజ్ఞప్తి చేశారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

బోధన్: పాఠశాల దశ నుంచే విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సాలూర మండల తహసీల్దార్ మల్లేశం సూచించారు. సంక్రాంతిని పురస్కరించుకొని సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్ నేతృత్వంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ సీజన్-3ని బుధవారం ఆయన ప్రారంభించారు. వారం రోజులపాటు టోర్నమెంట్ కొనసాగనుంది. సర్పంచ్ భుయ్యాన్ చంద్రకళ రాజప్పపటేల్, ఎంపీటీసీ కండెల సవితాసంజీవ్‌కుమార్, సొసైటీ సీఈవో బస్వంత్‌రావు పటేల్, నాయకులు అల్లె రమేశ్, డిస్కో సాయిలు, పంచాయతీవార్డు సభ్యులు, సొసైటీ డైరెక్టర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

స్కూళ్లలో సంక్రాంతి సంబురాలు

ఆర్మూర్, బోధన్, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలోని పలు పాఠశాలల్లో బుధవారం సంక్రాంతి సంబురాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు పోటాపోటీగా రంగవళ్లులు వేశారు. భోగి మంటలు వేసి, చిన్నారులకు భోగి పండ్లు పోశారు. చిన్నారులతో గాలిపటాలు ఎగురవేయించారు.
– సాక్షి నెట్‌వర్క్


ఆర్మూర్ గురుకుల పాఠశాలలో..


బోధన్‌లోని సాయిప్రసన్న పాఠశాలలో..


కోటగిరిలోని శ్రీవేద హైస్కూల్‌లో..

పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు

నందిపేట్ (ఆర్మూర్): పల్లెలు దేశానికి పట్టుగొమ్మలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. భైంసా ప్రాంతంలోని కథ్‌గావ్ వేదం తపోవన్ రెసిడెన్షియల్ హైస్కూల్ ఆధ్వర్యంలో మండలంలోని తల్వేదలో బుధవారం నిర్వహించిన ‘గ్రామదర్శిని’ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు వేర్వేరుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. సర్పంచ్ చందన సాయారెడ్డి, ఎంపీటీసీ లింగన్న, నందిపేట సర్పంచ్ వాణి తిరుపతి, విజయారవీందర్‌రావు, పాఠశాల ఎండీ శ్రీనివాస్, ప్రిన్సిపల్ వరలక్ష్మి, కరస్పాండెంట్ ప్రకాశ్ పాల్గొన్నారు.

పర్సన్ ఇన్‌చార్జీలుగా బాధ్యతలివ్వాలి

పెర్కిట్(ఆర్మూర్): ఈ నెలలో సర్పంచుల పదవీకాలం ముగుస్తుండడంతో మళ్లీ ఎన్నికలు నిర్వహించే వరకు వారికి పర్సన్ ఇన్‌చార్జీలుగా బాధ్యతలు ఇవ్వాలని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు గోర్త రాజేందర్, సర్పంచుల సంఘం నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లో ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ హరగోపాల్, పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో సర్పంచులు పాల్గొన్నారు.

సినిమాలు	తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – డెవిల్ (తెలుగు)-10.05, 7.00
రాఘవరెడ్డి (తెలుగు) - 4.15
సలార్ (హిందీ)- 10.10
స్క్రీన్-2 – సలార్ (తెలుగు)- 11.00, 2.35, 6.10, 9.45
స్క్రీన్-3 – హాయ్‌నాన్న- 12.20, 6.45, 10.00, డెవిల్ (తెలుగు) - 3.35
స్క్రీన్-4 – హనుమాన్ (తెలుగు) - 6.30, 10.00